క్లుప్తంగా

ఆలయంలో దద్దాల పూజలు



పూజల్లో పాల్గొన్న ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బొమ్మనబోయినపల్లిలో కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ్ , నాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు దద్దాల, నాయకులను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, కటికల వెంకటరత్నం, దద్దాల రాములు, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలు, గొబ్బిళ్ల శ్రీను, తమ్మనేని శివరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు



సురేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మారెడ్డి వెంకటాద్రిరెడ్డి

కొండపి: మండలంలోని గుర్రప్పడియ గ్రామానికి చెందిన మారెడ్డి వెంకటాద్రి రెడ్డి స్టేట్ యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి సురేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సన్మానించి కేక్ కట్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కోవిలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కోవిలంపాడు ఫీడర్‌లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రసూల్ తెలిపారు. మరమ్మతులు, మెయింటినెన్స్ దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

ముగిసిన పోలేరమ్మతల్లి వార్షిక తిరునాళ్లు



మహాలక్ష్మి హోమం నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో గ్రామదేవత పోలేరమ్మతల్లి వార్షిక తిరునాళ్ల ఆదివారం ముగిసింది. అర్చకులు అమ్మవారి మూల విగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం మహాలక్ష్మి హోమం, పొంగళ్లు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డి, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

కె.బిట్రగుంటలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తాం

సింగరాయకొండ: జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో త్వరలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తామని, కార్యక్రమానికి మంత్రి స్వామిని కూడా ఆహ్వానిస్తామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రం అన్నారు. ఈ మేరకు ఆదివారంసీఐ కార్యాలయంలో సీఐ హజరత్తయ్యను కలిసి వినతిపత్రం అందజేసారు. ఇటీవల కె.బిట్రగుంట వాసులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జరుగుమల్లి ఎస్సై మహేంద్రను సస్పెండ్ చేయాలన్నారు. మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లికి పూజలు



అలంకరణలో రాచూరి పెద్దమ్మతల్లి

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రంలో శ్రీరాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం రెండవరోజు ఘనంగా సాగింది. అర్చకులు కేశవ వేద మంత్రాలతో అమ్మవారి మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ చేశారు. మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో స్వామికి అభిషేకపూజ, గోశాలలో గోపూజ, మహానివేదన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

తొలిరోజే పరేషాన్..

- మొరాయించిన సర్వర్లు..
- దుకాణాల మార్పుతో కార్డుదారుల ఇక్కట్లు
- చౌక దుకాణాల ఏర్పాటుపై ప్రచారం కరువు
- పార్టీ కార్యక్రమంలా... ప్రభుత్వ కార్యక్రమం..



కనిగిరిలో రేషన్ షాపు వద్ద కార్డు దారుల పడిగాపులు

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం తలపెట్టిన రేషన్ దుకాణాల ద్వార సరుకులు పంపిణీ కార్యక్రమం తొలి రోజు పరేషాన్‌గా మారింది. చాలా ప్రాంతాల్లో సర్వర్ సమస్యతో కార్డుదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. దూర ప్రాంతాల వారు ఉదయాన్నే రేషన్‌దుకాణాల వద్ద బారులుతీరారు. నిన్న మొన్నటి వరకు ఇంటికే రేషన్ సరుకులు వచ్చేవని, ఇప్పుడు రేషన్ దుకాణం నుంచి మోసుకెళ్లాల్సి వస్తోందని వృద్ధులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 217 రేషన్ షాపులు ఉండగా.. గతంలో చౌకదుకాణాలు ఉన్న ప్రదేశాలు గ్రామాలు కాకుండా కొన్ని ప్రాంతాల్లో రేషన్ దుకాణాల ఏరియాలు మార్చారు. పట్టణంలో గతంలో కాశీపురంలో ఉన్న షాపును దేవాంగ నగర్‌లో ఏర్పాటు చేశారు. అధికారులు మాత్రం ప్రజా సౌకార్యార్థం తాత్కలికంగా ఏర్పాటు చేశామని, కాశీపురంలో కూడా రెండో స్టాక్ పాయింట్ పెట్టి అక్కడ ఇస్తామని చెప్తున్నారు. కానీ కాశీపురం వాసులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. మరి కొంత మంది కార్డు దారులకు రేషన్ మొబైల్ వాహనాల తొలగింపు జరిగిన విషయం పూర్తిగా సమాచారం కూడా లేని పరిస్థితి. దీంతో కొన్ని షాపుల వద్ద కార్డులు దారులు గుంపులు చేరినా.. మరి కొన్ని చోట్ల మందకొడిగా ఉన్నారు.

మొరాయించిన సర్వేర్..

తొలి రోజు దాదాపు 15 శాతం వరకు రేషన్ పంపిణీ చేసినట్లు అధికారులు చెప్తున్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. అనేక రేషన్ షాపుల వద్ద ఉదయం వరకు సర్వర్ బాగానే పనిచేసినా.. సాయంత్రం నుంచి సర్వర్ మొరాయించింది. దీంతో కార్డుదారులు ఇక్కట్లు పడ్డారు. అయితే కొన్ని చోట్ల డీలర్లు ఎక్కువ మందికి బియ్యం పంపిణీ చేసినట్లు చూపించేందుకు థంబ్ వేయించుకుని తర్వాత సరుకులు, ఇస్తామని, లేగా దానికి సరిపడ నగదు ఇస్తామని సర్దిచెప్పి పంపిస్తున్నారు. ఎక్కువ మంది కార్డుదారులకు రేషన్ ఇచ్చామనే సంకేతాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు సాగించారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానమేది.. ?

చౌకదుకాణాలను నూతనంగా ప్రారంభించే కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమం అయినా.. టీడీపీ నాయకులు వారి పార్టీ కార్యక్రమంలా నిర్వహించారు. పౌరసరఫరాల విభాగం అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ, మున్సిపల్, సచివాలయ, అధికారులు కానీ ఎవ్వరు కూడా కనీసం ఆ వార్డు, గ్రామ, ప్రాదేశిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని 35 రేషన్ దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రక్రియ శనివారం పునః ప్రారంభమయింది. కాగా మొదటిరోజు రేషన్ పంపిణీలో సర్వర్, నెట్‌వర్క్ సమస్యలు కార్డుదారులను ఇబ్బందుల పాలుచేశాయి. 34 దుకాణాల్లో ఆన్‌లైన్‌లో, ఒక్క దుకాణం బోయమడుగులలో ఆఫ్‌లైన్‌లో రేషన్ పంపిణీ చేశారు.

పామూరు: మండలంలోని తొలిరోజు రేషన్ పంపిణీలో పలు సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా సర్వర్ సమస్యతో రేషన్ పంపిణీ పలుసార్లు నిలిచిపోగా రేషన్‌దుకాణాలవద్దనే కార్డుదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయంతో ఇబ్బందులు తలెత్తాయి.

హనుమంతునిపాడు: సర్వర్ సమస్య తలెత్తడంతో మండలంలో రేషన్ పంపిణీ సక్రమంగా జరగలేదు. మారుమూల గ్రామాల్లో సర్వర్ సమస్య బాగా ఇబ్బంది పెట్టింది.

సింగరాయకొండ: నియోజకవర్గంలో రేషన్‌దుకాణాల ద్వారా సరుకుల పంపిణీలో సర్వర్ సమస్యతో ఇబ్బందు పడ్డారు. ఉదయం సుమారు గంట సేపు సర్వర్ సమస్య తలెత్తగా, సాయంత్రం సుమారు ఒకటిన్నర గంట సేపు మరల సమస్య తలెత్తింది. దీనికి తోడు నెట్‌సిగ్నల్ సక్రమంగా లేకపోవడంతో ఒక్కో కార్డుదారునికి వేలిముద్రలు తీసుకొని సరుకులు ఇచ్చేందుకు చాలా సమయం పట్టింది. వాస్తవానికి ఒకరోజుకు సుమారు 100 కార్డులు వేయాల్సి ఉండగా సర్వర్ కారణంగా కేవలం సుమారు 40 కార్డులు మాత్రమే పంపిణీ చేయగలిగామని డీలర్లు చెబుతున్నారు. మరో పక్క కార్డు దారులు మాత్రం గతంలో రేషన్‌షాపులు ఉన్న ప్రాంతాల్లో కాకుండా కొత్త ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో 2కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. మొదటిరోజు కావటంతో కొన్ని షాపుల వద్ద టెంట్లు వేశారని లేకపోతే ఎండకు ఇబ్బంది పడాల్సి వచ్చేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటిరోజు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రేషన్‌పంపిణీ ప్రారంభించాలని చెప్పినా ఎక్కువ శాతం కూటమి పార్టి నాయకుల పర్యవేక్షణలోనే పంపిణీ జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పెదవెంకన్నపాలెంలో 5 కేజీలకు గాను 4 కేజీల పైన ఉన్న బియ్యం

పొన్నలూరు: గ్రామాల్లో రేషన్ వాహనాలు ద్వారా కాకుండా రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీకి పూనుకున్న కూటమి ప్రభుత్వం మొదటి రోజు ఆర్భాటం తప్పా ఏమి కనిపించ లేదు. గత నెల వరకు వాహనాల ద్వారా ఇంటి సమీపంలో రేషన్ సరుకులు తీసుకున్న కార్డుదారులు ఇప్పుడు రేషన్ షాపుల్లో సరుకులు తీసుకోవాలంటే గంటల తరబడి నిరీక్షించి పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తుంది. సర్వర్ కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో అక్కడక్కడ షాపుల దగ్గర కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి రోజే బియ్యం ఇచ్చే కొలతల్లో కూడా తేడా ఉన్నట్లు కార్డుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అధికారులు ఉన్నంత వరకు మొక్కుబడిగా రేషన్ షాపులు తెరచి ఆ తరువాత మూసివేశారు.



పామూరులో సర్వర్ పనిచేయకపోగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డు దారులు



టంగుటూరు మండలం వల్లూరులో రేషన్‌షాపు వద్ద గుమికూడిన కార్డుదారులు



కొండపిలో సర్వర్ సమస్యతో వేచిచూస్తున్న జనం

హామీలు అమలు చేసే వరకు పోరాటం

- వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయండి
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలవు సురేష్



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సురేష్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు జూన్ 4వ తేదిన వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వ్యవస్థలన్నీ నాశనం చేసిందని ఆరోపించారు. ఇంటింటికీ రేషన్ బియ్యం వాహనం వచ్చి ఇస్తుంటే, దాన్ని రద్దు చేసి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో సుమారు కిలో మీటరు నుంచి మూడు కిలోమీటర్ దూరంలో రేషన్‌షాపులు ఉన్నాయని, సామాన్యులు రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బంది పడాల్సిన దుస్థితి ఉందన్నారు. 65 ఏళ్ల వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ ఇంటివద్దే పంపిణీ చేస్తామని చెబుతున్నారని ఆ విధంగా పంపిణీ జరిగేనా అని అనుమానం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రెండో ముఖ్యమంత్రిగా చలామణి అవుతున్న నారాలోకేష్ తన విద్యాశాఖ పనితీరులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పదో తరగతి మూల్యాంకనంలోనూ తప్పులు తడకగా ఉండటంతో సుమారు 60 వేల మందికి పైగా విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని విమర్శించారు. డీఎస్సీ పరీక్షలు ప్రకటించి ఏడాదైనా ఇంత వరకు అతీగతి లేదన్నారు. ఉపాధ్యాయుల బదిలీల దగ్గర నుంచి వారి సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఉచిత బస్సు ఏడాదైనా ఎదురుచూపులకే పరిమితమైందన్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వ నాయకులు ఇసుక, మద్యం దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలను అటకెక్కించిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు తుంగలో తొక్కి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, పాపం పండేరోజు ఎంతోదూరంలో లేదని తీవ్రంగా స్పందించారు. జూన్ 4వ తేదీ కొండపిలో నిర్వహించే వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, చింతపల్లి హరిబాబు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, బచ్చల కోటేశ్వరరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ అధ్యక్షుడు పూసపాటి మణికంఠేశ్వరరెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్, రాష్ట్ర యూత్ వింగ్ జోనల్ అధ్యక్షుడు మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో బత్తుల, దద్దాల, బన్నీ, కేవీ, తిరుపతిరెడ్డి, కస్తూరిరెడ్డి, పార్టీ నేతలు

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

- ఏడాది లోనే కూటమిపై ప్రజల తిరుగుబాటు
- వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి
- కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

కనిగిరిరూరల్: అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ.. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న చేపట్టిన వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వెన్నుపోటు దినం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం దద్దాల నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు నాయుడని తీవ్రంగా ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని అందించి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరొందరన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. టీడీపీ నిర్వహించిన మహానాడు...ఓ పెద్ద డ్రామాలా జరిగిందని.. ఎద్దేవా చేశారు. కూటమి సర్కార్ అక్రమ కేసులకు ఎవ్వరూ భయపడే పరిస్థితి లేదన్నారు. పథకాలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ మాట్లాడుతూ కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలకు సున్నం పెట్టిందని ఘాటుగా విమర్శించారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న రోజులు వైఎస్సార్ సీపీవే నన్నారు. మనమంతా సమష్టిగా పనిచేద్దాం 2029లో జగనన్న సీఎం చేద్దాం అని పిలుపునిచ్చారు. జూన్ 4న జరగనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు వేలాది సంఖ్యలో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి తరలి రావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పై ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం తీవ్రంగా విఫలం చెందిందన్నారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, భువనగిరి వెంకటయ్య, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకట రత్నం, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, డాక్టర్ రసూల్, తమ్మినేని సుజాతరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, సిద్దారెడ్డి, ఎ నాగమణి, నాగూర్‌బీ, షకీలా, శ్రీహరిరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సాంబిరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, తాతపుడి సురేష్, నాని, నరాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న నేతలు

కొండపి: మండలంలోని పెట్లూరులో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కల్లూరి చంద్రమౌళి పండిస్తున్న బొప్పాయి తోటను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు అన్నారు. పెట్లూరు గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి తోటను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కేవలం కక్షపూర్వకంగా గ్రామంలోని కొందరు కూటమి నాయకుల ప్రమేయంతో బొప్పాయి తోటను ధ్వంసం చేశారన్నారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత రైతును పరామర్శించి పార్టీ తరపున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. శ్రీనివాసరెడ్డి, కోయవారిపాలెం సుబ్బు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నయ్యకు ఘన నివాళి



చిన్నయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ, నాయకులు

పామూరు: మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొడవటికంటి చిన్నయ్య (96) శనివారం మృతిచెందారు. ఈసందర్భంగా ఆదివారం చిన్నయ్య భౌతిక కాయానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చిన్నయ్య కృషి ఎనలేనిదని ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి గట్లా విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, జక్కు శ్రీనివాసులురెడ్డి, బోయళ్ల మహేష్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



ఎం నిడమానూరులో సాగు లాభాలు వివరిస్తున్న ఇన్‌చార్జి వెంకట్రావు

టంగుటూరు: నవధాన్యాల సాగుతో భూమి సారవంతంతో పాటు అధిక దిగుబడులు సాధిస్తాయని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు పేర్కొన్నారు. ఏపీసీఎన్‌ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో ఎం నిడమానూరులో ఆదివారం రైతు కాకుమాని రమణయ్య పొలంలో నవధాన్యాల విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకట్రావు మాట్లాడుతూ విత్తనాలు వేసిన 45 రోజులు తర్వాత పంటను కలియదున్నటం వల్ల పచ్చి రొట్ట ఎరువుగా మారి ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. మండలంలోని రైతులకు నవధాన్యాల కిట్ కావాలంటే 9121147616 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి వెంకట్రావు, ఐసీఆర్పీ శృతి, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా సయ్యద్ యాసీన్



సయ్యద్ యాసీన్

కనిగిరిరూరల్: సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా సయ్యద్ యాసీన్ రెండో సారి ఎన్నికైయ్యారు. సహాయ కార్యదర్శులుగా వజ్రాల సుబ్బారావు, పందిటి మోహన్‌లతో పాటు మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా 61 మందిని సమితి సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును పాలేటిపల్లి, మోపాడు, పునుగోడు, ఎన్ గొల్లపల్లి, పందువ గండి రిజర్వాయర్‌లలో అనుసంధానం చేయాలన్నారు. నిమ్జ్ పరిశ్రమల ఏర్పాటుకు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని, ట్రిపుల్ ఐటీ కాలేజీకి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పోతల ప్రభాకర్, జీపీ రామారావు, ఎస్‌కే గులాం, ఖాశింపీరా, పుట్టా సుబ్బారావు, వి మీరావలి, బాషా తదితరులు పాల్గొన్నారు.


పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద ట్రాఫిక్‌జాం



పోలేరమ్మ గుడి వద్ద ట్రాఫిక్ స్తంభించిన దృశ్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం సుమారు 4 గంటల సేపు భారీగా ట్రాఫిక్‌జాం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయానికి వెళ్లలేక, ఆలయానికి వెళ్లిన వారు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినా పోలీసులు ఎవ్వరూ ఆ దరిదాపులకు రాలేదు. ఉత్సవాలు, ఇతర రద్దీ సమయాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం పరిపాటి. కానీ పోలీసులు మాత్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమ కేసులు బనాయించడం పై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై లేదన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

అపూర్వ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పాఠశాల పూర్వ విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు): పూర్వ విద్యార్థుల కలయిక మధురానుభూతిని మిగిల్చిందని పాఠశాల పూర్వ, విశ్రాంత ఉపాధ్యాయులు జొన్నలగడ్డ గోవిందయ్య, ఓ.మాలకొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1980–81 నుంచి 1990–91 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం పాఠశాల ఆవరణలో ఎం చైతన్యకుమార్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ, విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం మంచి మంచి సంప్రదాయమన్నారు. నాటి మధురస్మృతులను గుర్తు చేసుకొని మనసార నవ్వుకున్నారు. కార్యక్రమంలో బోయళ్ల నారాయణరెడ్డి, పాలిశెట్టి సత్యనారాయణ, అంబాల సుబ్బారెడ్డి,చిన్న సుబ్బారెడ్డి, పి.కృష్ణమోహన్, సంగిశెట్టి పీరయ్య, పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ తరగతులు

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి కళాశాలలకు రెగ్యులర్‌గా వచ్చే విధంగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని హాజరు 75 శాతం ఉంటే మాత్రమే పబ్లిక్ పరీక్షలకు హాల్ టికెట్లు ఇస్తామని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యను బోధించే అధ్యాపకులున్నారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.